ఆరాధించే మతం పట్ల గౌరవం, పూజించే దేవుళ్ళ పట్ల భక్తి భయం ,
మతం ఆదేశించిన ఆచారాల పట్ల నమ్మకం ఉండి కూడా,
ఆర్థికపరమైన  ప్రాపంచిక కారణాలు రక్త సంబంధాలను,
ఆపేక్షలను ధ్వంసం చేస్తుంటే మనసులో పెరిగే ద్వేషం
పుట్టినప్పటి నుంచి పెంచుకున్న నమ్మకాలను పటాపంచలు చేస్తుంది.

కె.వి. గిరిధరరావు

# 12

# అమ్మ

అక్బర్





నాకు నమ్మశక్యంగా లేదు!

అమ్మ అలా చేసిందా? మహాలక్ష్మి పెద్దమ్మ అదీ అరవై పైబడ్డాక?!

అదే అన్నాను నాన్నతో.

అమ్మకు పెద్దక్క. అమ్మకంటే దరిదాపు పదేళ్లు పెద్ద. పెద్దమ్మను మా ఊళ్ల వైపు 'ఆమ్మ' అనిపిలుస్తాం.

''పెళ్లికి వస్తుందిగా. నువ్వే మాట్లాడు,'' అన్నాడు నాన్న.

తమ్ముడి పెళ్లికని వూరొచ్చాను. పెళ్లికూతురు వాళ్ల వూళ్లో పెళ్లి. పెళ్లి మర్నాడు మా ఇంట్లో సత్యనారాయణ స్వామి వ్రతం.

నాకు ఆమ్మ దగ్గర చనువెక్కువ. నా చిన్నతనంలో నన్ను ప్రేమగా చూసేది. పెద్దయ్యాక కూడా, ఎప్పుడోగానీ ఆమెను కలవక పోయినా, ఎప్పటికప్పుడు నా బాగోగులు అమ్మని అడుగుతూ వుంటుందట.

ఆమెకు ఒక కొడుకు, కూతురు.

పెళ్లయ్యాక కూతురు భర్తతో పాటు వైజాగ్‌లో ఉంటోంది.

కొడుకు వూళ్లోనే ఉన్నా వేరు కాపురం పెట్టాడు. ఈమధ్య పండగలకు పబ్బాలకు కూడా కలవడం లేదట. పెదనాన్న పోయాక, తల్లీ కొడుకుల మధ్య గొడవలు మరీ పెరిగి మాట్లాడుకోవడం కూడా మానేశారట. మాట్లాడుకోనంతగా ఏ గొడవలు జరిగాయో ఎవరూ పూర్తిగా చెప్పడం లేదు. పొడిగా తలా ఓ ముక్క చెబుతున్నారు.

అమ్మనడిగాను.

''ఇద్దరి మధ్య ఏవో డబ్బు గొడవలట. అది నాక్కూడా సరిగ్గా చెప్పి చావదు,'' అంది. అంతకుమించి వివరాలు చెప్పలేదు. ఆమ్మ చేసిన పనికి అమ్మకు కూడా కోపంగా ఉంది.

కూతురు కుటుంబంతో రాకపోకలున్నా, కొడుకుతో పొరపొచ్చా లొచ్చి మాటలు లేనంతగా దూరం కావడం తెలిసి నాకు చాలా బాధేసింది.

పెద్దమ్మ పెళ్లికి రాలేదు. పెళ్లికి ఆమె కొడుకొచ్చాడు. కృష్ణన్నయ్య నాకన్నా పదేళ్లు పెద్ద.

చూడ్డానికి పెద్దమనిషి తరహాలో ఉన్నాడు. తెల్ల చొక్కా, తెల్ల ప్యాంటు. కాస్త బట్టతలా. ఉబ్బిన మొహం. చిన్న కళ్లు. ఒక మోస్తరుగా బొజ్జ.

"అమ్మ రాలేదేమిటన్నా?!" అడిగాను.

సమాధానం చెప్పలేదు.

"తనొస్తే బాగుండేది."

నవ్వి, "నీ కబుర్లేమిటి. అక్కడే సెటిలౌతావా, ఇక్కడకొచ్చే ఆలోచనేమైనా ఉందా?" అడిగాడు.

అమ్మ గురించి మాట్లాడ్డం ఇష్టంలేక మాట మార్చాడని అర్థమైంది.

రమక్క గురించి అడిగాను. మా పెద్దమ్మ కూతురు. కృష్ణ చెల్లెలు.

"రాలేదనుకుంటా," అన్నాడు నిరాసక్తంగా.

అంటే ఈ అన్నకు చెల్లెలితో కూడా అంతగా పొత్తు కుదరడం లేదన్న మాట అనుకున్నాను.

తర్వాత మాటలు ఉద్యోగాల వైపుకెళ్లాయి. ఇప్పుడు తను సొంతంగా సీఏ ప్రాక్టీసు చేస్తున్నాడట. అమెరికా వాళ్ల టాక్సులు చెయ్యడానికి ఒక చిన్న కంపెనీ కూడా మొదలెట్టాడట, ఇంకో సీఏతో కలిసి. వీటికి తోడు స్నేహితులతో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడానట. క్రొత్త రాజధాని అమరావతి దగ్గర ఈమధ్యనే కొన్న స్థలాల వివరాలు, విజయవాడలో అపార్ట్‌మెంట్ల సంగతి, సిటీలో తను నడిపే కార్ల గురించి చెప్పుకొచ్చాడు. ఆ మాటల్లో ఘాటైన డబ్బు వాసన తగిలింది.

పెళ్లిలో పెద్దమ్మ రాని లోటు నాకు బాగా కనిపించింది. నా పెళ్లప్పుడు మంటపం దగ్గరే పట్టుచీరలో, నుదుటి ఎర్రబొట్టుతో, మెళ్లో నగలతో శ్రీమహాలక్ష్మిలా నిలబడి, పంతులుగారితో మంత్రాలన్నీ శాస్త్రోక్తంగా చెప్పించింది. పెళ్లి పూజలన్నీ శ్రద్ధగా చేయించింది.

పెదనాన్న పోయాక ఆమెలో కళ తగ్గిందట. అంతకు ముందున్న హుషారు తనం ఇప్పుడు లేదట.

❖

వ్రతం రోజు.

ఇంటి వరండాలో పూజ జరుగుతోంది. చుట్టాలు పక్కాలు, ఆడవాళ్లు చాపల మీద కూర్చుని పూజ చూస్తున్నారు. పిల్లలు ఇంటి ఎదురుగా వేసిన షామియానా క్రింద కుర్చీల చుట్టూ పరుగులు పెడుతూ ఆడుకుంటున్నారు. అప్పటికి వచ్చిన మగవాళ్లు షామియానా క్రింద ఒక మూలకు కూర్చుని ఎవరి ఫోన్లతో వాళ్లు బిజీగా ఉన్నారు. నాకు పూజల మీద ఆసక్తి తక్కువ. నేను మరో మూల నా ఫోనుతో కూర్చున్నా.

మా బాబాయిగారబ్బాయి శీను వచ్చి నా పక్కన కుర్చీలో కూర్చున్నాడు.

''అమ్మ ఇంకా రాలేదేమిట్రా?'' అడిగాను.

''లక్ష్మమ్మామ్మా... ఇందాకే ఫోన్ చేశా. బస్సులో ఉందట. వచ్చే టయమయింది,'' అన్నాడు వీధిలోకి చూస్తూ.

అమ్మ వాళ్లది బాగా కలిగిన కుటుంబం. పెదనాన్నకు తండ్రి నుంచి పెద్దగా ఆస్తులు రాకపోయినా, పొగాకు వ్యాపారం చేసి బాగానే గడించాడు. ఆయనకు డబ్బు అంటే ఇష్టం. చాలా జాగ్రత్త మనిషి. బాగా కష్టపడేవాడు. అయిదారేళ్ల క్రితం హఠాత్తుగా గుండెపోటుతో పోయాడు.

''కృష్ణన్న వస్తున్నాడా?'' శీనుని అడిగాను.

నవ్వి, ''లేదన్నా. అమ్మ వస్తోందిగా. అయన రాడు''

''ఈమె వస్తే ఆయన రావడానికేమిటి?''

''వాళ్లిద్దరూ పలుక్కోరు కదా. ఒకళ్లొస్తున్నారంటే రెండోవాళ్లు రారు. నిన్న అందుకేగా అమ్మ పెళ్లికి రాలేదు,'' అన్నాడు.

ఆ ప్రక్కనే కూర్చుని పేపర్ చదువుతున్న కోటయ్య మామ, ''వాళ్లు వైరి శిబిరాలు మాదిరి తయారయ్యారు. ఎవరెంత చెప్పినా వినుకోరు. ఎవరికి వాళ్లు గిరిగీసుకుని బిగదీసుకుని కూర్చుంటే కలపడమెలాగా?! దేనికైనా పట్టు విడుపు ఉండాలి కదా,'' అన్నాడు.

''ఏమి పట్టువిడుపుల్లే మామా. అంతా నాకే కావాలి. నేనొక్కన్నే బాగుండాలంటే ఎలా? అమ్మ వాళ్లని ఎన్ని ఇబ్బందులు పెట్టలేదు. తియ్యగా మాట్లాడతా చూడ్డానికి సాఫ్ట్‌గా కనిపిస్తాడుగానీ మనిషికి డబ్బు దావాగ్ని,'' అన్నాడు శీను.

కోటయ్య మామ నవ్వాడు.

''ఏంది మామా నవ్వుతావ్?''

''నువ్వు చెప్పేది నిజమేరా శీను. కానీ ఈ రోజుల్లో డబ్బు దావాగ్ని లేని దెవరికి?'' అన్నాడు.

నేనిప్పటి వరకు ఏదో మాట పట్టింపులాంటి తాటాకు మంట గొడవలను కున్నాను. బంధాలనే భస్మం చేసే స్థాయి ఆస్తుల గొడవలన్న మాట! ఈ డబ్బు గొడవ లకి అమ్మ చేసినదానికి సంబంధమేమిటి?! అసలు ఎందుకలా చేసింది? ఆమెతో మాట్లాడితేగానీ తెలియదు!

"వీళ్లతోటి విసుగొస్తోంది. ఒక్కోసారి ఈమె వస్తుందేమోనని ఆయన, అయన వస్తున్నాడని ఈమె, ఇద్దరూ రారు," అన్నాడు శీను.

"ఇవ్వాళ కూడా నిన్ను చూడ్డానికొస్తోంది. నువ్వు మళ్లీ ఎన్నేళ్లకొస్తావేమోనని," నా వైపు చూస్తూ అన్నాడు కోటయ్య మామ.

"అదిగో అన్నా అమ్మ. మాటల్లోనే వస్తోంది," అన్నాడు శీను.

అటువైపు చూశాను.

ఒక చేతిలో సంచి పుచ్చుకుని, చేతికర్రతో నెమ్మదిగా నడుచుకుంటూ వస్తోంది.

శీను ఎదురెళ్లి, సంచి తన చేతిలోకి తీసుకుని ఆమెతో నడుచుకొస్తున్నాడు.

పచ్చగా కళకళలాడిన చెట్టు, చివరి దశలో మోడువారి కొయ్యగా మారి నడుచుకొస్తున్నట్లనిపించింది.

మనిషి బాగా పీక్కుపోయింది. వడలిన శరీరం. పల్చబడ్డ జుట్టు, అందులో మళ్లీ పాయలు పాయలుగా తెల్ల జుట్టు.

ఒకప్పుడెలా ఉండేది. పేరుకు తగ్గట్లు మహాలక్ష్మిలా ఉండేది. పచ్చటి పసిమి చాయ. నుదుట పెద్ద బొట్టు. చక్కగా దువ్వుకున్న ఒత్తైన జుట్టు. బోసిపోని మెడ. పట్టుచీరలో కాకపోయినా, ఒకమాదిరి ఖరీదైన చీరలో చాలా హుందాగా ఉండేది.

"బాగున్నావురా కన్నా?!" అంటూ, కళ్లద్దాలు సవరించుకుని నా ఎదురుగా కుర్చీలో కూర్చుని, "బాగా చిక్కిపోయావురా. కోడలు సరిగ్గా తిండి పెట్టడం లేదా?" అంది నవ్వుతూ.

"నా సంగతి సరే... నువ్వేమిటామ్మా ఇలా," అన్నాను.

"ఏముందిరా. ముసలిదాన్నయిపోలా," అంది.

అయిదారేళ్లలో ఎంత మార్పు?!

గ్లాసులో మంచి నీళ్లు తెచ్చిచ్చారు.

"అమ్మాయి, పిల్లలూ ఎక్కడ?" అడిగింది.

"ఇంట్లో పూజ దగ్గరున్నారు. నువ్వు కూడా వెళ్లి దణ్ణం పెట్టుకురా?" అన్నాను.

సమాధానంగా నవ్వింది.

అమ్మకు చిన్నప్పటి నుంచీ దేవుళ్లంటే భక్తి, భయం. పూజలు, వ్రతాలు చేసేది. పెరట్లోంచి కాసిన్ని పూలు, వంట గదిలోంచి కలకండో పంచదారో దేవుని పటాల ముందు పెట్టి, రోజూ ప్రొద్దునా సాయంత్రం దీపారాధన చేసేది. శనివారం గుడికెళ్లి కొబ్బరికాయ కొట్టేది. యేడాదికి ఒకసారన్నా కుటుంబ సమేతంగా తిరుపతికెళ్లి వెంకటేశ్వరస్వామిని దర్శించేది.

"నువ్వెప్పటిదాకా ఉంటావురా," అడిగింది.

చెప్పాను.

"నీకు మరియమ్మ గుర్తుందా? మా ఇంటెదురుగా ఉండేవాళ్లు?" అడిగింది.

గుర్తుందన్నట్లు తలూపాను.

"వాళ్లబ్బాయి కూడా నువ్వుండే వూళ్లోనేనంటగా ఉండేది."

"మా ఊళ్లో కాదు కానీ, దగ్గర వూళ్లోనే," అని, "కృష్ణన్నయ్య వాళ్లెలా ఉన్నారు?" అడిగాను.

సమాధానంగా, "నేనిప్పుడు మరియమ్మ వాళ్ల ఇంట్లోనే రెండు గదులు తీసుకుని అద్దెకుంటున్నా," చెప్పింది.

మా ఎదురుగా కూర్చున్న శీను సన్నగా నవ్వాడు.

పూజ అయిపోయినట్లుంది. ప్రసాదం పంచుతున్నారు. చెమట్లు తుడుచుకుంటూ కొంతమంది బయటకొచ్చారు. భోజనం ఏర్పాట్లకు షామియానా క్రింద కుర్చీలను ఒక వైపుకు సర్దుతున్నారు.

కాసేపు నిశ్శబ్దం తర్వాత, "నీ ఆరోగ్యమెలా ఉంటోంది?" అడిగాను.

"ఏదోలేరా. మీ అమ్మకులాగే బీపీ షుగరూ," అంది.

మేము కూర్చున్న చోటుకు ప్రసాదం తీర్థం వచ్చాయి. నేను చెయ్యి చాపి తీర్థం తాగి, ప్రసాదం పెట్టించుకుని కళ్లకద్దుకున్నాను.

అమ్మ ప్రసాదం, తీర్థం వద్దంది!

ఆశ్చర్యంగా చూశాను.

శీను నవ్వుతున్నాడు ముసిముసిగా.

"ఒకసారి లోపలికెళ్లి అమ్మకు కనిపించొస్తా," అంటూ లేచింది.

కర్ర ఊతంతో నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్లింది.

"అమ్మా- నీ బేగ్‌ని ఈ ఇంట్లో అమ్మ గదిలో పెట్టా," చెప్పాడు శీను.

అమ్మ వెళ్లాక మావాణ్ణడిగాను. ఎందుకురా అలా ముసిముసిగా నవ్వుతున్నావని.

‘‘ఆమ్మ ప్రసాదం వద్దంటేను,’’ అన్నాడు.

అయితే అన్నట్లు చూశాను.

‘‘అదే అన్నా. మతం మారిందిగా. అందుకే మన దేవుళ్లకు మొక్కదు. ప్రసాదాలు తినదు.’’

మతానికి ప్రసాదానికి లింకేమిటో నాకు బోధపడలేదు! నేనింకా షుగరుందని తీసుకోలేదనుకున్నా.

❖

మధ్యాహ్న భోజనాల హడావిడి అయిపోయేక, ఆమ్మను తీసుకుని నా గదికి వెళ్లా. అమ్మకూడా మాతో పాటు వచ్చింది.

‘‘ఏమిటామ్మ వెంకటేశ్వరస్వామినొదిలేసి ఏసుప్రభువును కొలుస్తున్నావట?’’

నవ్వుతూ ఎందుకడిగానో నాకు తెలియదు.

‘‘ఇద్దరూ దేవుళ్లే కదరా?’’ అంది, తను కూడా నవ్వుతూనే.

‘‘కదా... అలాంటప్పుడు చిన్నప్పటినుంచీ అలవాటుగా వెళ్లే గుడిని కాదని చర్చికి వెళ్లడమెందుకు?’’

‘రెండు చోట్లా ఉండేది దేవుడేగా? అన్నేళ్లూ ఆయన్ని నమ్మి కొలిచా. ఇప్పుడు ఈయన్ని పూజిస్తే తప్పేముంది?’’ అంది.

నేను మాట్లాడేలోపే, ‘‘ఇదే తంతురా. ఇద్దరూ ఒకటే- రెండూ ఒకటే అంటుంది గాని, మతమెందుకు పుచ్చుకుందో చెప్పదు,’’ అని, ఎవరో పిలిస్తే అమ్మ బయటకు వెళ్లింది.

‘‘ఏమామ్మా, ఏమైంది?’’ అడిగాను అనునయంగా.

మాటలు కూడదీసుకోడానికో, ఆలోచనల్ని క్రమంలో పెట్టుకోడానికో అన్నట్లు కాసేపాగి, చెప్పడం మొదలెట్టింది.

చెప్పుకుంటూ పోయింది.

రాళ్లకు తగిలి ముక్కలైపోతూ ఆక్రందనలు చేసే నీటిప్రవాహంలా చెప్పుకుంటూ పోయింది.

మధ్య మధ్యన నేను వింటున్నానంటూ ‘వూ’ కొట్టడం తప్పించి నేనేమీ ఆమె మాటలకు అడ్డుపడలేదు.

❖

నీకు తెలుసుగా వాణ్ణి ఎంత అపురూపంగా గారాబంగా పెంచామో! వాడడి గింది ఏనాడూ కాదనలేదు. అమ్మాయినైనా అప్పుడప్పుడూ కోప్పడేవాళ్లం కానీ, వీడిని ఎప్పుడూ ఏమీ అనలేదు. మహారాజును చూసినట్లు చూశాం.

కానీ పెళ్లితో వాడి ప్రవర్తన మారిపోయింది. అది వీడికి ఏమి నూరిపోసిందో, ఎలా మార్చిందో తెలియదు. అయినా దాన్ననుకునేదేముంది? మన బంగారం మంచి దైతేగా?! పెళ్లయిన దగ్గర్నుంచీ ఎప్పుడూ డబ్బు యావే! మీ పెదనాన్న బతికున్నప్పుడే ఆస్తులన్నీ తన పేర రాయమన్నాడు. అన్నీ నీకు పెడితే మా గతేమిటి. ఆడపిల్ల పరిస్థితేమిటి అంటే, నేను లేనా చూసుకోడానికి అనేవాడు. ఇదిగో అదిగో అంటూ వాయిదాలు వేసుకుంటూ గొడవని ఒక ఏడాదిపాటు ఆపాం. ఇక ఇలా కాదను కున్నాడేమో, కట్నం కోసం సాధిస్తున్నామని పెళ్లాంతో కేసు పెట్టించాడు. మేము పొయ్యాక అంతా నీదే కదరా అన్నా వినలేదు. పెద్ద మనుషుల మధ్య గడ్డం పట్టుకుని బ్రతిమలాడినా కనికరించలేదు.

ఏనాడూ పోలీసుల మొహం చూడని మమ్మల్ని స్టేషన్ మెట్లెక్కించాడు. ఆ కేసు నుంచి బయటపడ్డానికి మా తల ప్రాణాలు తోక్కొచ్చాయి. నాలుగెకరాల పొలం, ఒక ఇల్లు ఉంచుకుని మిగిలినదంతా వాడి యదాన పోశాం. అయినా ఊరుకుంటేగా? వీడి జాతర తట్టుకోలేకే మీ పెదనాన్న అర్థంతరంగా గుండాగి పోయాడు.

అప్పుడు వీడేమి చేసాడో తెలుసా? ఇంటి ముందు శవాన్ని వీధి కొదిలేసి, అందర్నీ పిలిచి ఆస్తుల గురించి పంచాయితీ పెట్టించాడు. మన ఆచారం ప్రకారం కొడుకు మాత్రమే తల కొరివి పెట్టాలంటూ పెద్ద మనుషులంతా చేరి వాడి చేతే ఆయనకు అంత్యక్రియలు జరిపించారు. తల కొరివి పెట్టినందుకు లంచంగా వున్న నాలుగెకరాలు కూడా వాడి మొహాన రాయమన్నారు. నేనలా రాయలేదని పొలం చుట్టూ కంచె వేసి రౌడీలతో నన్ను బెదిరించాడు. అవున్రా, అలా చేసినోడు నాకు కొడుకెట్లా అవతాడ్రా?! ఏమి? కొన్నాళ్లాగితే నేనూ పోతానుగా? ఇక్కడే పాతుకు పోతానా? పొయ్యేటప్పుడు ఉన్నదంతా మూటకట్టుకు పోనుగా? ఆ మాత్రం నేను చచ్చేదాకా ఆగలేనివాడు, అంతా వాడి చేతుల్లో పోస్తే, ఇక నన్నేం చూస్తాడు? ఉన్న దంతా వాడికి ధారాదత్తం చేస్తే, అందరి ముందు చేతులు చాపుతూ అడుక్కు తినట మేగా నాకు మిగిలేది?! ఏమి పాపం చేశానని నాకీ కడుపుకోత. ఆయనతోపాటు నేనూ పోయుంటే ఎంత బావుణ్ణేది?

అందరూ, 'ఎందుకమ్మా వాడితో గొడవ. సర్దుకుపోవచ్చుగా,' అని సలహా లిచ్చేవాళ్లే. వాడు రేపు నన్ను బయటకు నెడితే, వీళ్లు చూస్తారా నా బాగోగులు? కనే దానికి తెలుస్తాయి పురిటి నొప్పులు. చూసే వాళ్లకేం నొప్పి?!

వాడికి కాస్త గడ్డి పెట్టేవాళ్లు, గట్టిగా చెప్పేవాళ్లు లేరాయె.

ఉన్న పొలమంతా వాడే తీసుకున్నాడు. కాదు బలవంతానా ఆక్రమించుకున్నాడు. తర్వాత ఇంటిమీద కొచ్చాడు. 'నీ ఒక్కదానికి ఇంత పెద్ద ఇల్లెందుకు, రెండు గదులు సరిపోవా? పద నీకొక అద్దిల్లు చూపిస్తా. అద్దె నేనే కడతానని,' ఇంట్లో కొచ్చి నానా రచ్చ చేశాడు.

ఇల్లు ఖాళీ చేసి బయటకెళ్లకపోతే నన్ను జుట్టు పట్టుకు లాగి బయట పడేస్తానన్నాడు. అయినా కడుపున పుట్టినంత మాత్రాన ఆస్తులన్నీ వాడికి చెందుతాయా? వాడేనాడైనా మాకో రూపాయి ఇచ్చాడా? వాడి కష్టంతో మాకేమన్నా కొన్నాడా? అంతా మీ పెదనాన్న నోరు కట్టుకుని కూడబెట్టిందేగా?

చుట్టాలు పక్కాలు కూడా, 'వాడితో గొడవెందుకే లక్ష్మమ్మా,' అంటూ నాకు సుద్దులు చెప్పేవాళ్లే! అయినా అక్కడ గొడవ పడుతుందెవర్రా?! గొడవ పడొద్దని చెబుతుందెవరికి?!

నన్నెవరు కాపాడతారు? అందుకే ఎంతో ఇష్టంతో కష్టపడి కట్టుకున్న ఇల్లమ్మేశా. తగాదాల్లో ఉందికదా. బాగా తక్కువకమ్మాల్సొచ్చింది.

నువ్వు నమ్ముతావో లేదోగానీ, రోజూ పొద్దున లేవగానే... ఛీ ఇంకా బతికే వున్నానా అనుకుంటూ లేస్తున్నా. ఈ బతుకు బతుకేనారా?!

ఇంత చేసిన వాడి మొహం నేను చూడను.

నేను చచ్చాక వాడి నీడ కూడా నా శవం మీద పడకూడదు.

వాడు నాకు తలకొరివి పెట్టకూడదు. అందుకే తలకొరివి ఆచారం లేని ప్రభువు మతం పుచ్చుకున్నా.

నేను చచ్చేక వీళ్లంతా కలిసి వాడి చేత ఏమి చేయిస్తారో తెలియదు. కానీ చచ్చేదాకన్నా- నేను చచ్చాక కూడా వాడు నన్ను తాకడన్న నమ్మకంతో బతకాలని మతం మార్చుకున్నా!

నాకు తెలుసు మనోళ్లలో చాలామంది, చివరకు నా చెల్లెలు... అదే మీ అమ్మ కూడా, నేను డబ్బుకు కక్కుర్తి పడి మతం మారానని అనుకుంటున్నారని!

ఒక నమ్మకం పటాపంచలైనప్పుడు, ఏ నమ్మకం లేని బతుక్కన్నా, ఇంకో నమ్మకంతో బతకడంలో తప్పేముంది?

నువ్వు చెప్పరా? చదువుకున్నోడివి? దేశాలు చూసినోడివి, నువ్వు చెప్పరా? నేను చేసినదాంట్లో ఏమైనా తప్పుందా?

ప్రవాహం ఆగింది.

ఆమె స్థితికి నాకు బాధేసింది. జాలేసింది.

'ఏడవకామ్మా అన్నీ సర్దుకుంటాయి. చక్కబడతాయి,' అని నోటి మాటతో సముదాయించే ధైర్యం కూడా చేయలేకపోయాను.

కన్నీరు ధారగా అమ్మ బుగ్గల్ని తడుముతున్నాయి.

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*28 ఆగస్టు 2016*

❋




కె.వి. గిరిధరరావు ప్రకాశం జిల్లా వలపర్ల గ్రామంలో ఆగస్టు 10న జన్మించారు. వీరి మొదటి కథ *నిజంగా...* ఈమాట అంతర్జాల పత్రికలో 2000 సంవత్సరంలో అచ్చయింది. ఇప్పటివరకు దాదాపు ఇరవై కథలు రాశారు. షార్ట్ ఫిల్మ్ పట్ల ఆసక్తి. అమెరికాలోని కాలిఫోర్నియాలో నివాసం.

**girirao99@gmail.com**